సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం,9 జూలై 2024



# ప్రజా హృదయ నేత వైఎస్ఆర్

**- అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి**



**పెదపూడి, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రజల హృదయాల్లో మహోన్నత ముఖ్యమంత్రి గా చిర స్థాయిగా నిల్చిపోయిన ఏకైక ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమేనని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెదపూడి లో వైఎస్ఆర్ 75వ జయంతి వేడుకలను ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్బంగా వైయస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కేక్ ను సూర్యనారాయణ రెడ్డి కట్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి తన పరిపాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాలలో ఆత్మ బంధువుగా నిలిచారని, తాను చనిపోయి15 సంవత్సరాల అవుతున్న ఇప్పటికి కూడా మన మధ్య ఆయన సజీవంగానే ఉన్నట్లు ఉంటుందని తెలిపారు. స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి అందించిన పాలన ప్రతి కుటుంబంలో సంతోషాలనింపిందని అందుకే నేటికీ ప్రజల హృదయాలలో ఆత్మబంధువుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, వైకాపా సీనియర్ నాయకులు సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్లు కొటికలపూడి చినబాబు, కోసూరి వాసు, ఎంపీటీసీ పేపకాయల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ఆసుపత్రుల్లో

# మౌలిక సదుపాయాలు కల్పన

- ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది
- ఆసుపత్రికి వెళ్లితే దేవాలయానికి వెళ్లిన అనుభూతిని ప్రజల్లో ఉండే విధంగా అభివృద్ధి చేస్తాం..
- రూ.13. 85 కోట్లతో నిర్మించనున్న ఏరియా ఆసుపత్రి వంద పడకల అదనపు భవనానికి భూమి పూజ శంకుస్థాపన
- రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్యాశాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్





**ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్యబ్యూరో :**

ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఆరోగ్యం కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.సోమవారం స్థానిక ద్వారంపూడి బుల్లెమ్మ ఏరియా ఆసుపత్రి ఆవరణలో మంత్రి సత్య కుమార్ యాదవ్ స్థానిక శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పార్లమెంట్ సభ్యులు పురందేశ్వరి, స్థానిక నాయకులు అధికారులతో కలిసి రూ.13.85 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఏరియా ఆసుపత్రి వంద పడకల అదనపు భవనానికి భూమి పూజ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనపర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని.. ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం ఇందు కొరకు రు. 13.85 కోట్ల రూపాయలతో వంద పడకల అదనపు భవనాన్ని నిర్మించే దిశగా భూమి పూజ శంకుస్థాపన చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆపదలో ఉన్న ప్రాణాలు నిలిపి వారికి పునర్జన్మనిచ్చేది ఆసుపత్రి మాత్రమేనని, ఆసుపత్రికి వెళ్ళితే దేవాలయానికి వెళ్లిన అనుభూతిని ప్రజల్లో ఉండే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. దేశ ప్రధాని మోదీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంగా ఆసుపత్రులకు నామకరణం కూడా చేయడం జరిగిందన్నారు. గతంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో 7 మంది వైద్యులు మాత్రమే ఉంటే, నేడు ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసిన తరువాత 22 మంది వైద్యులు వైద్య సిబ్బంది, ఇతర సిబ్బందితో కలిసి మొత్తం 96 మంది విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏరియా ఆసుపత్రి ద్వారా అనేకరకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. 45 వేల జనాభా గల అనపర్తిలో సామాజిక ఆసుపత్రి సరిపోతుందని అయితే ప్రజల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధితో స్థానిక శాసనసభ్యులు రామకృష్ణారెడ్డి తాను శాసనసభ్యులుగా చేసిన గత కాలంలోనే ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అయితే పరిపాలన విధానం గత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదని మంత్రి అన్నారు. గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఆసుపత్రిలో అభివృద్ధికి విచ్చించలేదన్నారు. పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు భరోసా కల్పించే ఆరోగ్య శ్రీ పథకంలో కూడా రూ.2 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, ఇలా బకాయి ఉంటే ఏ కార్పొరేట్ ఆసుపత్రి పేదల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు వస్తుందని ఆయన విమర్శించారు.

రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణ లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తాయని, ఆ దిశగా ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తి ఏరియా ఆసుపత్రిని రూ.13.85 కోట్ల రూపాయలతో వంద పడకల ఆసుపత్రి అదనపు భవనాల అభివృద్ధిని ఆరోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో మా తండ్రి మూలారెడ్డి హయాంలో పీహెచ్సీగా ఉన్న ఆస్పత్రిని 30 పడకల చేయడం జరిగిందని తెలిపారు. 2014-19 కాలంలో రూ.5 కోట్లు నాబార్డ్ నిధులతో ఆసుపత్రి అదనపు భవనాలు నిర్మించుకున్నామన్నారు. నీలం తుఫాన్ వలన ఆసుపత్రి చుట్టూ నీటితో మునగడం వలన మరో కోటి రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనపర్తి సామర్లకోట కాకినాడ రూ.5.7 కోట్లు, రామవరం రాయవరం రోడ్డు అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరయ్యాయని, త్వరలో ఆర్అండ్బిఅధికారులుపనులు చేపట్టనున్నారు. నియోజకవర్గంలో కాకినాడ సాగర్ కెనాల్ తూడు తొలగింపు పనులు చేపట్టామన్నారు. గోదావరి కెనాల్ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. ప్రజలకి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉచిత ఇసుక పాలసీని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 3 వేల రూపాయల నుండి 4 వేల రూపాయలు వరకు పెంచి బకాయిలతోసహా జూలై మాసంలో పెన్షన్ లబ్ధిదారుకు 7వేల రూపాయలు అందించారని శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రి 100 పడకల అదనపు భవన నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్ కు కూటమి ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.**రామవరం ప్రభుత్వ హోమియో వైద్యశాలను పరిశీలించిన మంత్రి సత్య కుమార్..**మంత్రి సత్య కుమార్ యాదవ్ రామవరం ప్రభుత్వ హోమియో వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ కు వివరిస్తూ గత కొంతకాలంగా ప్రభుత్వ హోమియో వైద్యశాల మూత పడిందని తిరిగి దానిని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ చుట్టుపక్కల గ్రామాలకు ఈ వైద్యశాల ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. హోమియో వైద్యశాలకు నూతన భవనాన్ని ఏర్పాటు చేసే వరకు స్థానికంగా ఉన్న ఆయుష్ ఆసుపత్రిలో హోమియో వైద్య శాల ద్వారా ప్రజలకు వైద్య సేవలను అందిస్తామని మంత్రికి విన్నవించారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంటు సభ్యులుదగ్గుపాటి పురందేశ్వరి, శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రీజనల్ డైరెక్టర్ పి పద్మ శశిధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డా. కేవెంకటేశ్వరరావు, డా.నరసింహనాయక్, డిసిహెచ్ఎస్డా.ఎన్పద్మశ్రీ రాణి, సూపరింటెంట్ డాక్టర్ రామ గురు రెడ్డి, మాజీమంత్రి టిడిపి రాష్ట్ర కార్యదర్శి జవహర్ రెడ్డి, స్థానిక నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ ఛైర్మన్ పదవిపై జనసేన గురి..

**- లింగోలు పండుకే మెండుగా అవకాశం..?**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఉమ్మడి కూటమి అధికారం లోకి వచ్చాక ఇప్పుడు నామినేటెడ్ పదవుల జాతర మొదలయ్యింది... అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజక వర్గంలో నామినేటెడ్ పదవుల ఎన్నికలో ఇప్పుడు ఆశావాహుల జోరు ఊపందుకుంది.. కూటమి పార్టీల్కైన తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతాపార్టీల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వం పదవులపై గంపెడాశలు పెట్టుకుంటున్నాయి.. ఈ పదవుల జాబితాలో అమలాపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి గురించి ఆశావాహుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండగా ప్రధానంగా ఈపదవిని జనసేన కు కేటాయించాలన్న డిమాండ్ పెరిగింది. అయితే దీనికి మూడు పార్టీలు ఒకే తాటిమీదకు వస్తాయా లేదన్నది మాత్రం ఇంకా సందిగ్ధం నెలకొన్న పరిస్థితి కనిపిస్తోంది..

జనసేనకే ఏఎంసీ పదవి కేటాయించాలని డిమాండ్..

అమలాపురం మార్కెట్ కమిటీ అధ్యక్షురాలిగా ఉన్న దంగేటి డోలామణి వైసీపీ ప్రభుత్వం ఓటమితో తన పదవికి రాజీనామా చేశారు. అయితే ఇప్పుడు ఆ పదవి ఖాళీ అవ్వడంతో అందరి చూపు ఏఎంసీ ఛైర్మన్ గిరీకోసం ఒక్కసారిగా పోటీ పెరిగిపోయింది. ఈ పదవిపై టీడీపీ నుంచి కూడా పలువురు నాయకులు పోటీపుడుతుండగా ఏఎంసీ ఛైర్మన్ పదవి కూటమి పార్టీ జనసేనకే ఇవ్వాలని ఆ పార్టీ ముఖ్యనాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఇప్పటికే అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కలిసి ఏఎంసీ ఛైర్మన్ పదవి జనసేనకే కేటాయించాలని కోరిన పరిస్థితి ఉంది.

జనసేనలో ఆశావాహుల జోరు.. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గెలుపులోనే కాకుండా భారీ మెజార్టీ సాధనకు జనసేన పార్టీ నాయకులు చాలా కీలకంగా పనిచేసిన పరిస్థితి ఉంది.. జనసేన నుంచి పదవి ఆశిస్తున్నవారి జాబితాలో అమలాపురం రూరల్ మండలం వేమవరంకు చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు లింగోలు అన్నవరం(పండు) మొదటి వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. లింగోలు పండు అభ్యర్థిత్వానికే పార్టీ నుంచి ఎక్కువ మద్దతు లభిస్తున్నట్లు చెబుతున్నారు. జనసేన పార్టీ నుంచి కూడా ముఖ్యనాయకులు లింగోలు పండు పేరే సూచించినట్లు సమాచారం.

## కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమమునకు 64 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీ కి స్వయంగా తెలియచేసుకున్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాలలోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.జె.వి.భాస్కరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ గ్రీవెన్స్‌లో 47 వినతులు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, ఐటీడిఎ పరిపాలనా అధికారి డి.యన్.వి. రమణతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈవారం 47 వినతి పత్రాలు రావడం జరిగిందని ఆయన తెలిపారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని బొడ్డగండి గ్రామంలో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని, మెట్టగూడెం నుండి పులికొండ వరకు మూడు కిలోమీటర్లు మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని, మంగంపాడు గ్రామంలోని చెక్ డాం కు మరమ్మతులు చేయించాలని, బొడ్డగండి పంచాయితీ పరిధిలో 19 గ్రామాలకు సంబంధించిన కొండ రెడ్డి కులస్తులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని మంగంపాడు గ్రామానికి చెందిన సారంకోట అబ్బాయి రెడ్డి, నైని లచ్చిరెడ్డి వినతిపత్రాన్ని సమర్పించారు. మారేడుమిల్లి మండలం పొట్లవాడ గ్రామం నుండి కెచ్చెలవాడ గ్రామాల మధ్యలో కాల్వకు వంతెన ఏర్పాటు చేయాలని, మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని, కెచ్చెలవాడ గ్రామంలో పక్కా స్కూల్ భవనం ఏర్పాటు చేయాలని, అంగన్వాడి కేంద్రానికి పక్కా భవనం ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన పల్లాల కృష్ణారెడ్డి, పల్లాల అనిత, సాదల బుల్లెమ్మ దరఖాస్తు సమర్పి ంచారు. వై.రామవరం మండలం పాతకోట పంచాయతీలోని గొరు కుల గొంది నుండి పాతకోట వరకు సుమారు 7 కిలోమీటర్లకు మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన గొల్లూరి ప్రభాకర్, కొర్ర దొమ్ము దరఖాస్తు సమర్పించారు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో వైఎస్సార్

**- మాజీ మంత్రి కన్నబాబు**
**- ఘనంగా వైస్సార్ జయంతి వేడుకలు**



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** ప్రజల గుండెల్లో నేటికి వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచారని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా కాకినాడలో పలుచోట్ల (బాలాజీ చెరువు సెంటర్లోని, వాకలపూడి లోని, రమణయ్యపేటలోని వై.ఎస్.అర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా క్యాంపు కార్యాలయం నందు వై. ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి వై.ఎస్.అర్. కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ మాజీ శాసనసభ్యులు కురసాల కన్నబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వైఎస్సార్ పాలన రాష్ట్రంలో ఆనాడు స్వర్ణయుగాన్ని తలపించేటట్లు పరిపాలన సాగించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వై.ఎస్.అర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కురసాల సత్యనారాయణ, జడ్పీటీసీ కిట్టు, కాకినాడ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న సాగర్, బెజవాడ సత్యనారాయణ, గీశాల శ్రీను, జమ్మలమడక నాగమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళ అదృశ్యం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ర్యాలీ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యం అయ్యింది. ర్యాలి గ్రామానికి చెందిన రేలంగి లక్ష్మి తిరుపతమ్మ అనే 24 ఏళ్ల అవివాహిత సోమవారం 2 గంటల సమయంలో ఇంటిలో ఎవరికీ సమాచారం చెప్పకుండా బయటకు వెళ్ళిపోయినది.

ఆ తర్వాత తండ్రి రేలంగి సూరిబాబు బంధువుల సహాయంతో చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకి లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్రేయపురం ఎస్సై ఎస్.శ్రీనివాసు తెలిపినారు.

# ప్రధాని మోదీతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ భేటీ

**- రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చ**
**- సానుకూలంగా స్పందించిన ప్రధాని**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వ విధ్వంస పాలన, ఆర్థిక అరాచకంతో ఆంధ్రప్రదేశ్ 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని, విభజిత రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకోవడంతోపాటు, పెండింగ్ ప్రాజెక్టులు మంజూరుకు సహకరించాలని ప్రధాని నరేంద్ర మోదీని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఇటీవల ప్రధాని మోదీతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై ప్రధానితో చర్చించారు. గడిచిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కూటమి నాయకత్వంపై ప్రజలు ఎంతో విశ్వాసంతో చరిత్రలో కనీవినీ ఎరుగని విజయాన్ని అందించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏపీ అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరించాలని కోరారు. గత ఐదేళ్లు రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోయిందని, రాజధాని అమరావతిని దేశంలోనే మోడల్ రాజధానిగా తీర్చిదిద్దడంతోపాటు ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలో పోర్టులు అభివృద్ధి, కేంద్ర సంస్థలు ఏర్పాటు, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు మంజూరులో ఉదారంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజవర్గంలో ఉప్పాడ తీర ప్రాంతం, టెంపుల్ సర్క్యూట్‌ను అభివృద్ధి చేయడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని ఈ సందర్భంగా ఎంపి ఉదయ్ శ్రీనివాస్ ప్రధాని మోదీని కోరారు.

వీటిపై సానుకూలంగా స్పందించిన ప్రధాని రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికగా 125 అర్జీలు

**- ఆన్లైన్‌లో 122 ఆఫ్ లైన్‌లో 3 అర్జీలు**
**- మీకోసంలో జిల్లా స్థాయి అధికారుల హాజరు తప్పనిసరి**
**- కలెక్టర్ పి.ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వర పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల నుంచి అధ్యక్షులు ఉందన్నారు. అధికార అధికార హాజరు శాతాన్ని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఎవరైనా అధికారి హాజరుకాని పక్షంలో ముందేస్తూ అనుమతి తప్పనిసరి అన్నారు. స్పందనలో అర్జీలు ఇవ్వడానికి వచ్చిన దివ్యాంగుల వద్దకు స్వయంగా వెళ్లి కలెక్టర్ వారి నుంచి అర్జీలను స్వీకరించడం జరిగింది.

-అర్జీ వివరాలు: రాజమండ్రి సీతం పేటకు చెందిన గడ్డికుప్పల వరలక్ష్మి కలెక్టర్‌కి ఇచ్చిన అర్జీలో తాను తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు, నడవలేని స్థితిలో వీల్ చైర్ కే పరిమితం అయ్యానని, ఆర్థికంగా ఇబ్బందులూ పడుతున్నట్లు తెలిపారు. దివ్యాంగుల ధ్రువపత్రం, పెన్షన్ రూ.15 వేలు, 35 కేజీల బియ్యం కార్డు జారీ కోసం అర్జీ ఇవ్వడం



జరిగింది.

-ట్రై సైకిల్ అందచేత ..ధవళేశ్వరంకు చెందిన యర్రా ఉమా మహేశ్వరి జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో 8500 లో ఖరీదైన ట్రై సైకిల్ ను కలెక్టర్ చేతుల మీదుగా అందచేసారు. శాఖల వారీగా అందిన అర్జీలు పంచాయతీ 30 రాజ్ , రెవిన్యూ 31 , వైద్య ఆరోగ్య 13 , పోలీసు 11 , ఇతర శాఖలు 40 ప్రజల నుంచి మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, డి ఆర్వో జి. నరసింహులు, టూరిజం జె డి వి. స్వామి నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు టీ. రాధిక, ఆర్ట్. కృష్ణ నాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



సామర్లకోట, మేజర్ న్యూస్ : పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ చాళుక్యకుమార రామ భీమేశ్వర స్వామి నిత్య అన్నదాన కార్యక్రమానికి హైదరాబాదు వాస్తవ్యులు యర్రపోతిన వెంకట రామ చౌదరి, ఆశ రాణి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం భీమేశ్వర స్వామిని, బాలా త్రిపురసుందరి అమ్మవారిని వెంకట రమణ చౌదరి కుటుంభం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాలయాల్లో వారు పూజలు చేసి, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యానిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం సమక్షంలో ఆలయ అర్చకులకు రూ. లక్ష చెక్కును అందజేశారు.

## రాష్ట్రస్థాయి నాటికల పోటీలకు మంత్రి కందుల దుర్గేష్‌కు ఆహ్వానం

**- ఆహ్వానించిన అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్తు ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుండి 14వ తేదీ వరకు కాకినాడ సూర్య కళామందిర్ లో జరిగే రాష్ట్రస్థాయి నాటికల పోటీలను తమరు ప్రారంభించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందులు దుర్గేష్ కు సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు ఆహ్వాన పత్రికను అందజేశారు. సోమవారం రాజమహేంద్రవరం జే.ఎన్.రోడ్ లోని మంత్రి నివాసంలో బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బృందంతో మంత్రిని కలిసిన జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆయన తండ్రి పడాల రామారావు జీవితం-సాహిత్యం గ్రంథాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజు స్మారక కళావేదిక ఉపాధ్యక్షుడు ఎస్.వి.ఆర్. బాపిరాజు, ఆహ్వాన కమిటీ కో-కన్వీనర్ టీ.వీ.ఎస్.ఎన్.రెడ్డి, నిర్వాహకుడు పంపన మురళి పాల్గొన్నారు.

# హైస్కూల్ సెంటర్లో ఆక్రమణల కనికట్టు..!







**- హైకోర్టు ఆదేశాలు నేటికీ నెరవేరని దుస్థితి..**
**- ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు సతమతం..**
**- హైస్కూల్‌లోకి చొరబడుతున్న మందుబాబులు..**

**అమలాపురం, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఎంతో చరిత్ర కలిగిన ఉన్నత విద్యాలయం అది.. ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన సరస్వతీ నిలయం కూడా... అయితే ఇప్పుడు ఆక్రమణల చెరలోకి వెళ్లి మందుబాబుల చొరబాట్లుతో సతమతం అవుతోంది.. మరోపక్క ఆక్రమణల చెరతో బక్కచిక్కిపోతున్న హైస్కూల్ రోడ్డు మార్గం ప్రక్షాళన లేక ట్రాఫిక్ ఇబ్బందుల మధ్య ప్రజలు ఇబ్బందులు పడేలా చేస్తోంది... ఆక్రమణల కనికట్టు కట్లు విప్పే మార్గం లేక చివరకు హైకోర్టు కూడా తక్షణం ఆక్రమణలు తొలగించాలని నిర్దేశించినా హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారన్న ఆరోపణలు స్థానిక అధికారులు ఎదుర్కొంటున్నారు.

అమలాపురం పట్టణంలోని హైస్కూల్ సెంటర్‌లో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కుడిపూడి చిట్టబ్బాయి సమయంలో రోడ్డును ఆనకుని ఉన్న హైస్కూల్ కు చెందిన స్థలంలో దుకాణ సముదాయన్ని నిర్మించారు. ఆ సమయంలో ఈ నిర్మాణాలపై కొంత వివాదం రేగిన పరిస్థితి కనిపించింది. అయితే స్వల్ప వ్యవధిలోనే ముందు నుంచి ఆ ప్రాంతంలో ఉన్న చిరువ్యాపారస్తులకే కేటాయించుకునేలా వారే స్వయంగా నిర్మాణాలు జరుపుకున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ప్రస్తుత ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అక్రమ నిర్మాణాలు నిభంధనలకు పూర్తి విరుద్ధమని, జడ్పీకు సంబంధించిన ఈ స్థలంలో నిర్మాణాలు చట్ట విరుద్ధమని, ఈ నిర్మాణాల వల్ల ఈ దుకాణాల వెనుక వైపున ఉన్న బాలుర, బాలికల పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇబ్బందులు పడతారని హైకోర్టుకు విన్నవించడంతో తక్షణం అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించింది. అయితే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ అక్రమ నిర్మాణాల విషయంలో చర్యలు తీసుకోవడంలో అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఇదిలా ఉంటే ఆక్రమణలు తొలగించే విషయంలో వైసీపీ నాయకులు అడ్డుకోవడంతో అధికారులు ముందుకు కదలని పరిస్తితి కనిపించేది... అయితే ప్రభుత్వం మారడంతో ఇప్పటికైనా ఆక్రమణల తొలగింపు విషయంలో అధికారులు ముందుకు కదులుతారో లేదో వేచి చూడాల్సి ఉంది.



**తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు..** అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడే దుకాణాలు ఉండడం, ఆటోలు, ఇతర వాహనాలు ఈ ప్రాంతంలోనే నిలపడం వెరసి హైస్కూల్ సెంటర్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాల్లో దుకాణాల వద్ద నిలుపుతున్న వాహనాల వల్ల హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. **స్కూల్‌లోకి చొరబడుతున్న మందుబాబులు..** హైస్కూల్ సెంటర్‌లో దుకాణ సముదాయాల వెనుక నుంచి బాలుర, బాలికల హైస్కూల్ ప్రాంగణంలోకి రాత్రివేళల్లో చొరబడి మందుబాబులు వీరంగం సృష్టిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని పలువురు మండి పడుతున్నారు. పాఠశాలల ప్రాంగణంలో ఖాళీ మందు సీసాలు కనిపిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసుల నిఘా ఉంచి స్కూల్ ప్రాంగణంలోకి చొరబడుతున్న మందుబాబులను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. **హైకోర్టు ఆదేశాలుఅమలు చేయాలి..** అమలాపురం జడ్పీ బాలుర, బాలిక పాఠశాలల ముందు అక్రమంగా నిర్మించిన దుకాణ సముదాయాలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు డిమాండ్ చేశారు. పాఠశాలలకు చెందిన స్థలాల్లో అక్రమనిర్మాణాలు చట్ట విరుద్ధమని, వీటిని వెంటనే తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు ఆక్రమణలు తొలగించలేదని, దీనిపై కోర్టు ధిక్కరణ వాజ్యం వేస్తానని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి

**- వాసు తానికొండ**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన నాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని వైసిపి మండల అధ్యక్షులు తానికొండ వాసు అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నందిగామ గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షులు తాడికొండ వాసు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వైస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురికి మిఠా యిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తాడి కొండ వాసు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి గొప్ప పథకాలను రాష్ట్ర ప్రజల కోసం ప్రవేశపెట్టిన మహానేత వైఎస్ఆర్ అని, ప్రజలు వైస్ రాజశేఖర్ రెడ్డి ని గుండెల్లో పెట్టుకున్నారని, పేద ప్రజల కోసం పరితపించిన నాయకుడు వైయస్సార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇంగిలపుబేబీ,జిల్లాయువజనవిభాగం కార్య దర్శి గోడపర్తి సత్య ప్రసాద్ (చిన్ని), వైసిపి నాయకులు నాగయ్య, సంతోష్, రాజేష్, సురేందర్, సుందర్‌రావు, కిట్టయ్య మరియు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**- జడ్పీటిసి లోవరాజు**



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గొల్లప్రోలు జడ్పిటిసి ఉలవకాయల నాగ లోవరాజు తెలిపారు. మండల పరిధి చేబ్రోలు గ్రామంలో రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి గొల్లప్రోలు జడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు అరిగెల రామయ్యదొర, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం జడ్పిటిసి లోవరాజు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు వైఎస్సార్ చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు సర్పంచ్ దొండపాటి లోవతల్లి, పార్టీ గ్రామ అధ్యక్షులు పుప్పాల బాబులు, ఎంపీటీసీలు పడాల ప్రభాకర్, ఇసరపు రామకృష్ణ, వార్డు సభ్యులు ఓరుగంటి ప్రసాద్, చల్లా విష్ణు, చల్లా ఆదియ్య, విద్యా కమిటీ చైర్మన్ లు వులవకాయల రాంబాబు, వులవల కొండ, సత్యడ రమేష్, పార్టీ సీనియర్ నాయకులు యలమంచిలి గంగారావు, లోకారెడ్డి అప్పన్నదొర, మల్లిపూడి గంగాధర్, సూరిబాబు, ఓరుగంటి రవి, చల్లా లక్ష్మీనారాయణ, ఓరుగంటి వెంకట సత్యనారాయణ, ఓరుగంటి రాజు, వర్ధినీడి నాగసూర్యుడు, చిన్నం సుబ్బారావు, మంగం అర్జున్, సిద్ధా సత్తిబాబు, నూజివీడు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. గొల్లప్రోలులో..గొల్లప్రోలు పట్టణ పరిధిలో వైఎస్ఆర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో గల వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. వైయస్సార్ జయంతిని పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మైనం రాజా, రామిశెట్టి సత్తిబాబు, జ్యోతుల సత్తిబాబు, కీర్తి రాము, వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి, సింగం నాగేశ్వరరావు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు గొల్లప్రోలులో ఘనంగా నిర్వహించారు. సోమవారం గొల్లప్రోలు రాయవరంరోడ్డులో రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు వైయస్సార్ పార్టీ నాయకుడు మొగలి అయ్యారావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ కాంస్య విగ్రహానికి గొల్లప్రోలు వైయస్సార్ పార్టీ నాయకుడు అజాతశత్రువు, జ్యోతుల భీముడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అయ్యారావు, నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైయస్సార్ అంటూ నినాదాలు చేశారు. అలాగే పిఠాపురం నియోజకవర్గం వైయస్సార్ పార్టీ ఇంచార్జి వంగా గీత విశ్వనాథం నాయకత్వం వర్ధిల్లాలంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మొగలి అయ్యారావు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను జడ్పిటిసి గుర్తు చేశారు. అలాగే రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్ పార్టీ శ్రేణులు గండేటి రాము, మొగలి దొరబాబు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, ప్రథమ వైస్‌చైర్మన్ తెడ్లపు అఖిల్, తెడ్లపు చిన్నారావు, వైయస్సార్ పార్టీ గొల్లప్రోలు టౌన్ అధ్యక్షుడు మైను రాజా, మొగలి నారాయణమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

**- పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రామచంద్రపురం ఆర్.డీ.ఓ. సుధాసాగర్‌కి స్పందనలో వినతి పత్రం అందజేశారు. సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, షూలు అమ్ముతూ విద్యావ్యవస్థను వ్యాపార సంస్థలుగా మారుస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని, తల్లిదండ్రులు కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలలో అధిక ఫీజులు కట్టలేక అప్పులు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా విద్యా అర్హత లేని టీచర్లుతో బోధన సాగిస్తున్నారని, గుర్తింపు లేని బ్రాంచీలను ఏర్పాటు చేస్తూ స్కూళ్లను నడుపుతున్నారని, ఫిట్నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతు న్నారని, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా మౌలిక వసతులు లేకుండా ఇరుకు, ఇరుకు గదులలో కాలం వెళ్ళదీసే పరిస్థితి ఉన్నదన్నారు. ఈ విధంగా ఉన్న విద్యా సంస్థలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరైన నిర్ణయం కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని, నూతన ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అధికారులు ఆర్డీఓకి, రామచంద్రపురం డివిజన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కి వినతి పత్రాలు అందజేశారు. ఆర్.డి.ఓ. వారు పాఠశాలలో అధిక ఫీజుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూనాయకులు కె.నవీన్ పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు శ్రీనుకు ఎంపీ ఎమ్మెల్యే పలకరింపు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** అంబాజీపేటకు చెందిన సీనియర్ పాత్రికేయులు, ఈనాడు విలేఖరి పళ్ళ శ్రీనివాస్ (ఈనాడు శ్రీను) ను అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు సోమవారం ఆయన ఇంటి వద్ద పలకరించారు. ఇటీవల అమలాపురం సమీపంలోని ఈదరపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ చేతి చిటికెన వేలు భాగం విరిగింది. శస్త్ర చికిత్స అనంతరం శ్రీను ఇంటివద్ద ఉంటున్నారు. దీంతో ఆయనను ఎంపీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు నాయకులు పలకరించి సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే సీనియర్ పాత్రికేయులు మాలే వెంకట దుర్గా ప్రసాద్ ని కూడా ఎంపీ ఎమ్మెల్యే పలకరించారు. ఆంధ్రజ్యోతి విలేకరి కుమార్ ను ఎంపీ హరీష్ మాధుర్ ఫోన్లో పలకరించారు. కూటమి నాయకులు గణపతి వీరరాఘవులు, సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి సుబ్బారావు, బొంతు పెదబాబు, సుంకర బాలాజీ, దాసరి వీర వెంకట సత్యనారాయణ , దంతులూరి శ్రీను రాజు, రవణం రాము, మైపాల తాతాజీ, పత్తి దత్తుడు, గుమ్మడి నాగమణి, మట్టపర్తి భారతి, గంగుమళ్ళ వీరభద్రరావు, ఆకుల సూరిబాబు, వాకపల్లి దొరబాబు తదితరులు ఉన్నారు. ×××

## రాజమండ్రి లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా గుప్తా





**కాకినాడ, మేజర్ న్యూస్ :** 62 సంవత్సరాల చరిత్ర కలిగిన రాజమండ్రి లయన్స్ క్లబ్‌కు నూతన అధ్యక్షులుగా ఎస్.బి. మోటార్స్ సంస్థ జనరల్ మేనేజర్ మద్దుల వి.ఎస్.శ్రీరామగుప్తా, కార్యదర్శిగా వెన్నా కుమారస్వామి, కోశాధికారిగా వుల్లగంటి రాఘవరావులు బాధ్యతలు చేపట్టారు. సమావేశానికి ఎ.వి.ఎస్.సత్యనారాయణ (బాబుశ్రీ) అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా లయన్స్ డిస్ట్రిక్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు, ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా పిడిజి గ్రంధి వెంకటేశ్వరరావు, కీనోట్ స్పీకర్‌గా ఎస్.బి. గ్రూప్ చైర్మన్ మట్టపల్లి రంగప్రసాద్, గౌరవ అతిథిగా జి.ఎం.టి. కొల్లూరి గోపాలకృష్ణ, రీజియన్ చైర్‌పర్సన్ ముదునూరు వాణిశ్రీ, జోన్ చైర్‌పర్సన్ ఎ.వి.ఎస్.సత్యనారాయణలు పాల్గొని ప్రసంగించారు. రాజమండి వై.ఎం.వి.ఎ. హాల్ నందు ఆదివారం ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉపాధ్యక్షులుగా వారణాసి రామకృష్ణ, బి.వి.వి.ఎన్.ఎస్.రవికుమార్, నంబూరి సతీష్, సంయుక్త కార్యదర్శులుగా దొడ్డిపట్ల జయకృష్ణ చైతన్య, మీసాల వీరరాఘవులు, పసుమర్తి వెంకటేశ్వర్లు, గ్లోబల్ ఏక్షన్ టీమ్ జి.ఎల్.టి కోఆర్డినేటర్‌గా డా॥ గుబ్బల రాంబాబు, జి.ఎం.టి. కోఆర్డినేటర్ పి.డి.జి గ్రంధి వెంకటేశ్వరరావు, జి.ఎస్.టి కోఆర్డినేటర్‌గా కక్కిరాల బుచ్చిరాజు, ఎల్.సి.ఐ.ఎఫ్ కోఆర్డినేటర్‌గా కొల్లూరి గోపాలకృష్ణ, మార్కెటింగ్ అండ్ కమ్యునికేషన్ స్కిల్స్‌కి ఎన్.జయశ్రీ, డైరెక్టర్లుగా ఎం.వి.ఎన్.మాధవరావు, కొత్తా బాలమురళీకృష్ణ, పాలిక వెంకటరమణ, ఎన్.వి.ఆర్.గుప్తా, దాసరి బ్రహ్మగిరీష్, డా॥ కె.ఎస్.ఎల్.ప్రసాద్, కటికి కుమారస్వామి, మద్ది సత్యనారాయణ మూర్తి, కొండా రాజేష్, మాటూరి రంగారావు, కొల్లేపర శేషయ్య, నంబూరి సత్యదేవి, ఇన్నమూరి శ్రీరామచంద్రమూర్తి, ఎ.వి.నారాయణ, కె.నాగిరెడ్డి, గ్రంధి రాజేష్‌లు బాధ్యతలు చేపట్టారు. నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన గుప్తా మాట్లాడుతూ ఎంతో సేవా చరిత్ర కలిగిన రాజమండ్రి లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని, క్లబ్ గౌరవాన్ని, ప్రతిష్టను పెంచే విధంగా సేవా కార్యక్రమాలను సభ్యులతో పాటు సీనియర్ లయన్స్ నాయకులను ఎప్పటికప్పుడు సంప్రదించి నిర్వహిస్తానన్నారు. 62 సంవత్సరాలు చరిత్ర కలిగిన రాజమండ్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంతో పాటు పరిసర గ్రామాల్లోను విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్న ఆలోచన ఉన్నట్లు ప్రకటించారు.

## ఏలేరు సాగు నీటి వ్యవస్థ క్రింద వంతులవారీ విధానంలో నీటి విడుదల

**- జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగలి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఏలేరు సాగు నీటి వ్యవస్థ క్రింద ప్రస్తుతం సాగులో ఉన్న ఖరీఫ్ పంటలను నీటి ఎద్దడి లేకుండా సజావుగా పూర్తి చేసుకునేందుకు జూలై 9వ తేదీ నుంచి నవంబర్ 5 వరకు రానున్న 120 రోజులపాటు పిఠాపురం, పెద్దాపురం, కిర్లంపూడి మండలాలకు వంతులు వారీ విధానంలో సాగునీరు విడుదల చేస్తున్నామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి 10 రోజులు ఒక వంతు చొప్పున, తొలి 4 రోజుల పాటు పిఠాపురం మండలానికి, తదుపరి 3 రోజుల పాటు పెద్దాపురం మండలానికి, ఆపై 3 రోజుల పాటు కిర్లంపూడి మండలానికి రోజుకు 750 క్యూసెక్కుల చొప్పున ఏలేరు జలాశయం (700), తిమ్మరాజు చెరువు (50) లో నుండి విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు. ఈమేరకు వంతుల వారీ సాగు నీటి సరఫరా షెడ్యూల్ ను ఆయన సోమవారం ప్రకటించారు. ఈ షెడ్యూల్ ప్రకారం పిఠాపురం మండలానికి నీటి విడుదల తేదీలు (జూలై 9-12), (జూలై 19-22), (జూలై 29-ఆగష్టు1),(ఆగష్టు 8-11), (ఆగష్టు 18-21), (ఆగష్టు 28-31), (సెప్టెంబర్ 7-10), (సెప్టెంబర్ 17-20), (సెప్టెంబర్ 27-30), (అక్టోబరు 7-10), (అక్టోబరు 17-20), (అక్టోబరు 27-30) నీరు విడుదల చేయడం జరుగుతుందన్నారు.

పెద్దాపురం మండలానికి (జూలై 13-15), (జూలై 23-25), (ఆగష్టు 2-4), (ఆగష్టు 12-14), (ఆగష్టు 22-24), (సెప్టెంబర్ 1-3), (సెప్టెంబర్ 11-13), (సెప్టెంబర్ 21-23), (అక్టోబరు 1-3), (అక్టోబరు 11-13), (అక్టోబరు 21-23), (అక్టోబరు 31-నవంబరు2) తేదీల్లో నీటి విడుదల జరుగుతుందని తెలిపారు.

కిర్లంపూడి మండలానికి ((జూలై 16-18), (జూలై 26-28),(ఆగష్టు 5-7), (ఆగష్టు 15-17), (ఆగష్టు 25-27), (సెప్టెంబర్ 4-6), (సెప్టెంబర్ 14-16), (సెప్టెంబర్ 24-26), (అక్టోబరు 4-6), (అక్టోబరు 14-16), (అక్టోబరు 24-26), ((అక్టోబరు 3-5) తేదీల్లో నీరు సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్న దృష్ట్యా అందుబాటులో ఉన్న నీటిని సమర్ధవంతంగా వినియోగించేందుకు వంతుల వారీ విధానం అమలు చేస్తున్నామని, కావున ఏలేరు సాగు నీటి వ్యవస్థ క్రింద పంటలను సాగు చేసిన ఆయా మండలాల రైతులు అందరూ ఈ విధానానికి సహకరించి తమ ఖరీఫ్ పంటలను సజావుగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈలోపు వరద జలాలు చేరి ఏలేరు ప్రోజెక్ట్ తగిన స్థాయిలో నిండితే వంతుల వారీ విధానం రద్దు చేసి తిరిగి రిగ్యులర్ పద్దతిలో నీరు సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. వంతుల వారీ విధానాన్ని సమర్ధవంతంగా అమలు చేసి రైతుల పంటలకు ఎక్కడ సాగు నీటి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ ఏలేరు డివిజన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పేనాయక్



కాకినాడ, మేజర్ న్యూస్ : సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం -పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. డి.తిప్పే నాయక్, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీవో పీ.త్రినాథ్, జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ ఎన్.వి.వి.సత్యనారాయణ, జిల్లా పరిషత్ సీఈవో ఏ.శ్రీరామ చంద్రమూర్తి, డీపీవో కె.భారతి సౌజన్య, డిజాస్టర్ మేనేజ్మెంట్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్, ఎం.లావణ్య తదితరులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు..రెవిన్యూ, భూ తగాదాలు, పింఛన్ల వంటి అంశాలపై సుమారుగా 405 అర్జీలు అందజేశారు. ఈ అర్జీలను పరిష్కరించాల్సిందిగా వివిధ శాఖ అధికారులను డీఆర్వో తిప్పే నాయక్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారాని అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజా వినతులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, తీసుకున్న చర్యలను అప్డేట్ చేయాలని ఆయన సూచించారు. ప్రజా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి, సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కొండబాబును కలిసిన గణేశ ఉత్సవ సమితి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి కొండబాబుని సోమవారం నగర గణేశ ఉత్సవ సమితి ప్రతినిధులు కలిసారు. నగర గణేశు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న వినాయక చవితి జరుగుతున్న సందర్భంగా సెప్టెంబర్ 16వ తేదీన నిమజ్జనం కార్యక్రమం ఈ గణపతి ఉత్సవాలకు ప్రభుత్వం తరపున శాసనసభ్యులుగా అన్ని విధాల అండగా ఉండి కాకినాడ నగరంలో 36 సంవత్సరాలుగా జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించుటకు మీ యొక్క మీయొక్క మద్దతు తెలియజేయాలని సమితి తరపున వినతిపత్రం ఇచ్చి వారిని కార్యక్రమాలకి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు సంఘాని సత్యం, బి.బాలకృష్ణ, ధర్మరావు, కర్రి పాపారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

# రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించాలి



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** అమలాపురంలో ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఇటీవల తొలగించడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు, రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించాలని కోకో ఫెడ్ తరపున వినతి పత్రం సమర్పించారు.

సివిల్ సప్లయ్ వారి ఆదేశములు పాటించి వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులను సంబంధిత సలహా సంఘాల సభ్యులకు ఆహ్వానము పంపాలని ఆదేశములు ఇవ్వవలసినదిగా ఎంపి హరీష్ మాధుర్ ని, ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ ని కోకో ఫెడ్ చైర్ పర్సన్ అరిగెల బలరామ మూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్ కోరారు.

# వారాహి అమ్మ ఆలయం నిర్మించారు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** వారాహి అమ్మవారు.. ఈ అమ్మవారి గురించి పెద్దగా ఎవరికి తెలియదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాహనాన్ని తయారు చేయించిదానికివారాహి అని పేరు పెట్టారు. ఉపముఖ్యమంత్రి అయిన తర్వాత వారాహి అమ్మవారి దీక్ష తీసుకున్నారు. అప్పటినుంచి అమ్మవారి గురించి అందరూ తెలుసుకుంటున్నారు. నెటిజెన్లు గూగుల్లో వెతుకుతున్నారు. మొత్తం మీద అమ్మవారి గురించి అందరికీ తెలిసింది. తెలుగు రాష్ట్రాల్లో కరీంనగర్‌లో అమ్మవారి ఆలయం ఉంది. కాశీలో రెండు చోట్ల ఉంది అని చెప్తారు. అదే విధంగా అరుణాచలం వెళ్లే దారిలో కూడా ఉంది అంటారు. కానీ కాకినాడలో అమ్మవారి ఆలయం ఉందంటే జనం ఆశ్చర్యపోతారు.కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ కొవ్వూరులో నూతనంగా వారాహి అమ్మవారి ఆలయాన్ని లక్ష్మీ ప్రసన్న అనే భక్తురాలు నిర్మించారు. ఆమె అమ్మవారి భక్తురాలు. అమ్మ తనలోనే ఉంటుందని చెబుతున్నారు. ఆమె నూతనంగా ఆలయం నిర్మించడంతో అక్కడికి రావడానికి భక్తులు పోటీ పడుతున్నారు. దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తున్నారు. తనకు ముందు నుంచి అమ్మవారి పూజలు చేసే అలవాటు ఉంది. ఆమెను ఓ తల్లి, ఓ బిడ్డగా భావిస్తాను. తన



సోదరుడు అనారోగ్యానికి గురయ్యాడు, అప్పుడు తాను అమ్మవారి పూజ చేస్తూ సోదరుడుని దగ్గర కూర్చోబెట్టుకున్నా. ఆ మంత్రాలని విన్న తర్వాత అతని ఆరోగ్యం బాగుపడింది. దీంతో తన సోదరుడు ఆలయం కట్టాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే ఆలయం నిర్మించాం. ఎవరి వద్ద నయా పైసా తీసుకోలేదని లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈ అమ్మవారి గురించి ప్రతి ఒక్కరికి తెలిసింది. తొలుత పదుల్లో భక్తులు వచ్చేవారు. అనంతరం వందల్లో భక్తులు వచ్చేవారు. ఇప్పుడు వేలల్లో వస్తున్నారని వెల్లడించారు. సోమవారం 10 వేల మంది వరకు భక్తులు వచ్చారు. కేవలం కాకినాడ జిల్లానో, కాకినాడ రూరల్‌లోనో కాదు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చారు. వారికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతినిత్యం ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. వారాహి అమ్మవారి పూజ ఫల వ్రతకల్పం పుస్తకాలు కూడా ప్రింట్ చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. లక్ష్మీప్రసన్న , ఆమె తండ్రి, సోదరుడు ఇలా ఆలయాన్ని నిర్మించారు. ఆషాడ మాసం పాడ్యమి నుంచి అమ్మవారి మాలలు ధరించిన భక్తులు పెరిగారు. ప్రస్తుతం 100 మంది భక్తులు మాల ధరించి అక్కడే ఉంటున్నారు. కొంతమందికి అమ్మవారి ఫోటో ఇంటిలో ఉండకూడదని అపోహాలు ఉంటాయి. అలాంటిదేమీ లేదు, ఫోటో ఇంటిలోనే పెట్టుకోవచ్చు అంటున్నారు లక్ష్మీ ప్రసన్న. ఆమెను ఓ దేవతగా కాకుండా కన్నతల్లిగా లేదా కన్నబిడ్డగా చూడండి, ఆరాధించండి. ప్రేమించండి, ఆమె మహత్యం తెలుస్తుంది అని చెబుతున్నారు. అక్కడికి వచ్చిన కొంతమంది భక్తులు పూనకాలతో ఊగిపోయారు. వారిని పట్టుకోవడం ఎవరికీసాధ్యం కాలేదు. ఆలయంలో ఫోటోలు తీస్తున్నారు.కాళు కడుక్కోకుండా వస్తున్నారు. ఇలాంటి సాంప్రదాయానికి స్వస్తి పలకండి. ప్రతిరోజు రాత్రిళ్ళు పూజ చేయండి అంటూ పూనకం వచ్చిన మహిళలు చెప్పడం జరిగింది. వారు ఇక్కడికి చెందినవారు కాదు. అలా చెప్పించారు అనడానికి. వారు ఇద్దరు వేరే ప్రాంతాల నుంచి వచ్చినవారు. ఇదే మొదటిసారి వారు ఇక్కడికి రావడం. అమ్మ ఇక్కడ ఉంది అనడానికి ఇదే నిదర్శన మంటున్నారు అది చూసిన భక్తులు. మొత్తం మీద కాకినాడ రూరల్ కొవ్వూరులో వారాహి అమ్మ వారు కొలువుదీరారు. భక్తులు బారులు తీరుతున్నారు.

## పేదలకు భూములు పంపిణీ చేయాలి

**– సిపిఐఎంఎల్ లిబరేషన్ డిమాండ్**




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** పేదలకు భూములు పంపిణీ చేయాలనే డిమాండ్ సిపిఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ఏలేశ్వరం బాలాజీ చౌక్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ఎర్రజెండాల ప్రదర్శన నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ ర్యాలీకి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా లో ప్రదానంగా ఏలేశ్వరం మండలంలో ఉన్న కొంతమంది భూస్వాములు బినామీ పేర్లతో భూములను అస్తగతం చేసుకున్నారన్నారు. వీటిని తక్షణం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రవరం గ్రామంలో గత 30 సంవత్సరాలుగా దళితులు సర్వే నెంబరు 108, 109 సాగు చేసుకుంటూ ఉన్నారు. ఈ భూమి దళితులకు ఒక్కొక్కరు 30 సెంట్లు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం వారి సాగు హక్కును గుర్తించి ఆ భూమిని సాగులో ఉన్న దళితులకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో ఉన్న డి పట్టా భూములను కొంతమంది భూస్వాములు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని ప్రభుత్వాధికారులు దీనికి అడ్డుకట్ట వెయాలని అన్నారు. తరతరాలుగా ఉన్న భూములను కూడా భూస్వాములు ల్యాండ్ సీలింగ్ చట్టం కింద దాచుకోవడానికి చేసినటువంటి ప్రయత్నంలో భాగంగానే వినోబాబాకి దానం ఇచ్చారని అందుచేత అవి న్యాయంగా పేదలకు దక్కాల్సిన భూములని ఆయన అన్నారు. ర్యాలీ ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర వెళ్లి మెమోరండం మండల తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. భూములను సర్వే జరిపి పై సాగులుగా నమోదు చేసి పట్టాలు ఇవ్వాలని తాసిల్దార్ కు విన్నవించారు. దీనిలో బర్రె నూకరాజు చెక్క రాజులమ్మ, గుళ్ళ సత్యవతి ,ఇసనాపల్లి వీరబాబు శ్రీమంతుల జ్యోతి రండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌చే శాశ్వత ప్రాజెక్టుల ద్వారా సేవలు

**– నూతన కమిటీ ప్రమాణ స్వీకారం**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** శాశ్వత ప్రాజెక్టులను ప్రజలను అందుబాటులో ఉంచుతూ సామర్లకోట లయన్స్ క్లబ్ సేవలు మరింత మెరుగు పరచాలని లయన్స్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా మెంటర్, పాస్ట్ గవర్నర్ బాధం బాలకృష్ణ లు పిలుపు నిచ్చారు. సామర్లకోట శ్రీ భీమేశ్వర లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షులు ఎస్ ఆర్ వై వి ఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ సామర్లకోట క్లబ్ నుంచి ఇప్పటికే గవర్నర్ జిల్లా మొత్తంమీద సేవల విషయంలో ఎంతో ముందున్నట్టు చెప్పారు. ఇకపైనా నూతన కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి స్థానిక క్లబ్ ను మరింత అభివృద్ధి పదంలో నడపాలని సూచించారు. కాగా కార్యక్రమం లో జిల్లా క్లబ్ అభివృద్ధికి, క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రాజెక్టుల ద్వారా సాధించిన విజయాలను పలువురు నాయకులు వివరించారు. అలాగే కార్యక్రమం లో పాస్ట్ గవర్నర్, జిల్లా మెంటర్ బాధం బాలకృష్ణ చే నూతన అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, కోశాధికారి బడుగు సీతరామరాజు లచే ప్రమాణస్వీకారం చేయించి అధ్యక్షులు ప్రసాద్ కు అధికార దండాన్ని అందజేశారు. అనంతరం లయన్స్ జిల్లా నాలుమూలల క్లబ్ ల నుంచి విచ్చేసిన నాయకులు నూతన కమిటీని ఘనంగా సత్కరించి అభినదించారు. కార్యక్రమం లో క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎన్ ఐ టి విద్యాబ్యాసానికి ఎంపికైన పేద విద్యార్థికి ఆర్థిక సయాహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లాక్లబ్ మొదటి వైస్ గవర్నర్ వజ్రపు కోటేశ్వర రావు, రెండవ వైస్ గవర్నర్ చిట్టిండి శ్రీనివాస్, జిల్లా క్లబ్ నాయకులు మట్టే రాధ, ఆయా క్లబ్ ల నాయకులు దుర్గేష్, శ్రీరామ్ రాజు, నమస్సివాయ, శ్రీనివాస్, జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు (రాజా), మేకా శ్రీనివాసరావు, సింగవరపు సత్యనారాయణ, మద్దిరాల శివనాగకృష్ణ, అమలకంటి శ్రీనివాస్, ఎం విజయ భాస్కర రెడ్డి, కె విజయ కృష్ణ, కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి, గిడుతూరి శ్రీనివాస్, చీమలకొండ వీరభద్ర ప్రసాద్, చిత్తూలూరి శ్రీదేవి, ఎం విజయలక్ష్మి, ప్రముఖ న్యాయవాది అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

# కొబ్బరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మద్దతు ధరతో కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని అంబాజీపేట మార్కెట్ కమిటీ ఆవరణలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధూర్ సోమవారం ప్రారంభించారు. కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ కొబ్బరికి మద్దతు ధర నిరంతరం కొనసాగేలా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కొబ్బరి పంటతోపాటు ఉద్యాన పంటలకు ప్రభుత్వ తరపున వచ్చే అన్ని రాయితీలు ఉపయోగించుకొని రైతులు మంచి ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు అవసరం ఉన్నా ఎప్పటికప్పుడు ప్రజా ప్రతినిధులుగా ఎంపీతోపాటు నేను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.వి.రమణ, ఆయిల్ ఫెడ్ మేనేజర్ యూ.సుధాకర్ రావు, కృషివల కోకోనట్ ఫార్మర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, కార్యదర్శి ముత్యాల జమీల్, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, మైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, మట్టపర్తి భారతి, గుమ్మడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రంపచోడవరంలో ఐటీడీఏ పీవోకు, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు టి.ఎన్.ఎస్.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్య క్షులు డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి, టీడీపి, జనసేన మారేడుమిల్లి మండల అధ్యక్షులు సోమవారం తెలిపారు. మారేడుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. మారేడుమిల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్ (వై.టి.సి.) బిల్డింగ్‌లో గిరిజన విద్యార్థులకు వసతి కల్పించాలని హాస్టల్, కాలేజీ అందులో నిర్వహించాలని చెప్పడం జరిగిందన్నారు. సుమారు 130 మందికి పైగా విద్యార్థులు నీటి సదుపాయం లేక, సరైన సదుపాయాలు లేక కాలేజీకి వెళ్లి టీ.సి లు ఇవ్వమని విద్యార్థులు కోరుతున్నారని వారు వివరించారు. విద్యార్థుల సమస్యలు ఐటిడిఎ అధికారులు తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.ఎస్.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి పల్లాల, టీడీపి మండల అధ్యక్షులు గురుకు శేషు కుమార్, జనసేన మండల అధ్యక్షులు మల్ల దుర్గా ప్రసాద్, టీడీపి మండల ఉపాధ్యక్షులు కర్రి సన్యాసి రెడ్డి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి బిసెట్టి సత్య, కోండ్ల శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకులు జోక్యంతో బాధితుడికి న్యాయం



**రాజవొమ్మంగి,మేజర్ న్యూస్:** మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన పల్లి ప్రసాద్ ఇంటి సిమెంట్ రేకులుజాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పెద్ద పెద్ద రాళ్లు బ్లాస్టింగ్ చేస్తుండగా ఇంటి పైకి రాళ్లు వచ్చి సిమెంట్ రేకులుదెబ్బతిన్నాయి. దీంతో బాధితుడు ఇల్లు దెబ్బ తిన్న విషయాన్నిఎన్నిసార్లు జాతీయ రహదారి రోడ్ కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లిన స్పందించకపోవడంతో స్థానిక టిడిపి నాయకులు గణజాల తాతారావుకు తెలపడంతో పరిస్థితిని సమీక్షించిన తాతారావు జాతీయ రహదారి ప్రతినిధులకు బాంబ్ బ్లాస్టింగ్ వల్ల ఇల్లు దెబ్బ తిన్న విషయాన్ని తెలియపరిచి బాధితున్ని ఆదుకోమని కోరాగా బాధితుడు ఇంటికి కొత్త సిమెంట్ రేకులు ఇస్తామని హామీనిఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుపార్టీ నాయకులు సొసైటీ మాజీ అధ్యక్షులు గణజాల తాతారావ్, వాసంశెట్టి గంగాధర్, చెక్కా పండుబాబు, బారంగి అనుదీప్, కంటపురెడ్డి వీరబాబు(శ్రీను), తెడ్ల రాంబాబు, మాజీ సర్పంచ్ కోపూరి రత్నం, గణజాల మల్లిఖార్జున, సాగి చిన్నమ్ములు ,రేలంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంలో అభివృద్ధికి తొలి మెట్టు "ఉచిత ఇసుక"

**– నెరవేరనున్న పేదల సొంతింటి కల**
**– ఇసుక కుంభకోణం ద్వారా రూ.50 వేల కోట్లకు పైగా దోచుకున్న వైసిపి నేతలు**
**– నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి**



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. వలసపాకలలోని తమ స్వగృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి లు మాట్లాడుతూ...జగన్ ఐదేళ్ల పాలనలో ఇసుక బంగారం అయిందని..తాము అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోగా ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, సీఎం అయిన 20 రోజుల్లో ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చారన్నారు. దీంతో లక్షలాది కార్మికులకు ఉపాధి, భవన నిర్మాణ రంగానికి మేలు జరుగుతుందని, నిర్మాణ రంగం ఊపందుకుంటుందని అన్నారు. ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించి పేదల సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్రీ శాండ్ పాలసీ అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయడం ...బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే తెలుగుదేశం విధానమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పారదర్శకత, ముందుచూపుతో శాండ్ పాలసీని రూపొందించడం జరిగిందన్నారు. వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో దాదాపు పది లక్షలకు పైగా ఇళ్లు కట్టొచ్చంటే వారి అవినీతి ఏ స్థాయిలో అవినీతి చేశారో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ ఇసుక తవ్వకాలను నిరోధిస్తూ రాష్ట్ర ప్రజల ప్రగతే ధ్యేయంగా ఈ పాలసీ నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణ చేసే విధంగా రూపొందించారని, జిల్లాల స్థాయిలో శాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు పర్యవేక్షిస్తారని సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బతినకుండా ఉచిత ఇసుక అందిస్తామని తెలిపారు. భవన నిర్మాణ రంగంకు సంబంధించి భవన నిర్మాణ కార్మికులు, నిర్మాణ సామాగ్రి రవాణా కార్మికులు (తోపుడు బండి నుండి లారీల వరకు), సిమెంటు, స్టీలు వ్యాపారస్తులు, కలప వ్యాపారస్తులు మరియు వడ్రంగి కార్మికులు, ఎలక్ట్రికల్ సామాగ్రి వ్యాపారస్తులు, ఎలక్ట్రీషియన్స్, పెయింట్స్ వ్యాపారస్తులు, పెయింటర్స్, టైల్స్ వ్యాపారస్తులు, టైల్సేయింగ్ కార్మికులు, ప్లంబింగ్ కార్మికులు తదితర అనుయాయ రంగాలు కూడా ఆర్థికంగా పుంజుకుంటాయన్నారు.

## ఎరువులు, పురుగు మందుల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఎరువులు, పురుగు మందుల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక తనిఖీ అధికారి, శ్రీకాకుళం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రి కల్చర్ త్రినాథస్వామి అన్నారు. సోమవారం ఆయన ఏలేశ్వరం మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీలు చేశారు. అందులో భాగంగా శ్రీ లక్ష్మీ పార్వతి ఎరువులు మరియు పురుగుమందులు, లింగంపర్తి మరియు శ్రీ వెంకట నారాయణ & కో, ఏలేశ్వరం దుకాణాలలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరిఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఎరువులు పురుగు మందుల అమ్మకాలపై వ్యవసాయ అధికారులు ప్రత్యేక దష్టి సారిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని వ్యవ సాయ అధికారులంతా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలపై ప్రత్యేక నిఘాను ఉంచాలన్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయాలకు సంబంధించి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ను క్షుణ్ణంగా తనిఖీ చేసి డీలర్లకు తగు సూచనలు చేశారు. డీలర్స్ అందరూ సీడ్స్ ఫర్టిలైజర్స్, పురుగుమందుల చట్టాలకు లోబడి నియమని బంధనలకు అనుగుణంగా వ్యాపారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి డి.వి.వి.సతీష్ కుమార్, పెదపూడి మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్.మనిదీప్, మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి,వ్యవసాయ శాఖ పాల్గొన్నారు.

# ఉభయ గోదావరి జిల్లాల్లో పరిశుభ్రమైన త్రాగునీటి నందించడమే ప్రభుత్వ లక్ష్యం

**– గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలకు త్రాగునీటినందించే**
**– గోదావరి జలాలను కాలుష్య రహితంగా చేయడానికి అవసరమైన చర్యలు చేపడతాం**
**– రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్.**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలకు త్రాగునీటినందించే గోదావరి జలాలను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఉద్యమంలో భాగస్వామ్యులం అవుతామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం రాజమండ్రి పుష్కర్ ఘాట్ నందు ఏర్పాటుచేసిన గోదావరి పరిరక్షణ సమితి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి కందులు దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందరు దుర్గేష్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో పరిశుభ్రమైన త్రాగునీటి నందించడమే ప్రభుత్వ లక్ష్యంమన్నారు. సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని ఆశయ సాధన వలన ఉభయగోదావరి జిల్లాల్లో సాగునీటి కొరత లేకుండా పంటలు సుభిక్షంగా పండుతున్నాయన్నారు. అఖండ గోదావరిగా పేరుగాంచిన గోదావరినీటిని కలుషితం కాకుండా కాపాడు కోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గోదావరి నది పై భాగంలో పరిశ్రమలు విడిచిన వ్యర్థ పదార్థాలు గోదావరి నదిలో కలవడం క్రింది భాగంలో ఉన్న మనం వాటిని త్రాగునీటిగా వినియోగించుకుంటున్నామన్నారు. ఆ రోజుల్లోనే అప్పటి జిల్లా కలెక్టర్ రణదీప్ సుదాన్ పరిశ్రమల విడుదల చేసిన వ్యర్థ పదార్థాలు గోదావరి నదిలో కలవకుండా ఒక సపరేట్ డెడికేటెడ్ ఛానల్ ద్వారా సముద్రం వరకు వెళ్లి అక్కడ ఆ నీటిని శుభ్రం చేసి సముద్రంలోకి వదిలేలా ప్రతిపాదనలు చేశారన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించే దిశగా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి అప్పారావు, డాక్టర్ కర్రి రామిరెడ్డి, ఏ. సత్యనారా యణ, గంగిరెడ్డి, డి ఎం ఆర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన కూనవరం మండల వైసీపీ శ్రేణులు



**కూనవరం, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన కూనవరంలో వైయస్సార్ విగ్రహానికి పూలమాలవసి 75వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆవుల మర్యా దాసు కూనవరం ఎంపీపీ రంగమ్మ జడ్పిటిసి విజయ సర్పంచులు పార్వతి అభిరామ్ లక్ష్మి నోముల కొండలరావు కొమ్మని మోహన్ రావు బి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

## ఉచిత కంటివైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని జడ్డంగిలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. రంపచోడవరం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.శిరిషదేవి భాస్కర్ ఆధ్వర్యంలో రాజమండ్రి గౌతమీ నేత్రాలయ వారి అను బంధ సంస్థ శ్రీ కిరణ్ ప్రాథమిక కంటి ఆసుపత్రి, జగ్గంపేట వారు జడ్డంగి గ్రామ సచివాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం నందు కంటి చూపు సమస్యతో బాధపడుతున్న150మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంటి సమస్య తీవ్రంగా ఉన్న 20మందికి కంటి ఆపరేషన్ చేయుటకు, మరో 40మందికి కళ్లజోళ్లు అందజేయనున్నట్లు కంటి వైద్య నిపుణులుజయరావు, ఉమామహేశ్వరి తెలిపారు.. ఈ శిబిరంలో హాస్పిటల్ సిబ్బంది మహేశ్వరరావు, అనిల్ సేవలందిం చారు. మండల తెలుగుయువత అధ్యక్షుడు బారంగి అనుదీప్ పర్యవేక్షణ చేశారు. టిడిపి మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావ్, నాయకులు వాసంశెట్టి గంగాధర్, చెక్కా పండుబాబు,తెడ్ల రాంబాబు, కోపూరి రత్నం, సాగి చిన్నమ్ములు, రేలంగి శ్రీను, తోట వీరబాబు,గణజాల మల్లిఖార్జున,తెడ్లశ్రీకాంత్, కంటపురెడ్డిశ్రీను, గణజాలబాల గంగాధర్,వల్లూరి మణికంఠ రవితేజ, పాల్గొన్నారు.

## చార్టర్డ్ అకౌంటెంట్‌కు ప్రశంసలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామానికి చెందిన ఇందుకూరి మానస చార్టర్డ్ అకౌంటెంట్ పట్టా పొందడం పట్ల పలువురు గ్రామస్తులు అభినందించారు. సాధారణ రైతు గోపాల కృష్ణంరాజు కుమార్తె సిఏ ఫైనల్ దిగ్విజయంగా పూర్తి చేసింది. సోమవారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో యూనివర్సిటీ అధికారులు సిఏ పట్టా ప్రదానం చేసారు. గ్రామీణ ప్రాంతం నుంచి మానస సిఏ సాధించి గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది అని మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, పలువురు కొనియాడారు. మానస తండ్రి టీడీపీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. దీంతో టీడీపీ శ్రేణులు పలువురు మానసను అభినందించారు.

## విఆర్ఓ గణపతి రెడ్డి సేవలు మరువలేనివి



రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో విఆర్ఓ మిర్తివాడ గణపతిరెడ్డి విశేషమైన సేవలు అందించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. రంపచోడవరంలో వీఆర్వో గణపతి రెడ్డి అకాల మరణానికి చింతిస్తూ, శోకతప్త హృదయాలతో రెవెన్యూ ఉద్యోగులు ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ విధి నిర్వహణలో గణపతి రెడ్డి అంకితభావంతో పనిచేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల మన్ననలు పొందారన్నారు.

# రోటరీ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకం

**- రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ శ్రీరామ్ వెల్లడి**
**- ఘనంగా కాకినాడ గోల్డెన్ జూబ్లీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం**
**- నూతన అధ్యక్షులుగా శ్రీకాంత్**
**- సమిష్టి కృషితో డిస్ట్రిక్ట్‌లో ప్రథమ స్థానంలో నిలవాలి : డాక్టర్ ఎస్.వి.ఎస్. రావు**

**సూర్య మేజర్ న్యూస్ బ్యూరో** : రోటరీ క్లబ్ ద్వారా పేదలకు చేస్తున్న సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామిని శ్రీరామ్ అన్నారు. కాకినాడ వివేకానంద పార్కు వద్ద గల ఫ్యాబిన్ కన్వెన్షన్ హాలులో సోమవారం ఏర్పాటుచేసిన రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ గవర్నర్ శ్రీరామ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తొలిత జ్యోతి ప్రజ్వలన డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీరామ్ నిర్వహించారు.

బ్లడ్ బ్యాంక్, ఓల్డ్ ఏజ్ హోమ్, లయస్థానం బరియల్ గ్రౌండ్, డ్రింకింగ్ వాటర్ ప్లాంట్స్ వంటి ప్రాజెక్ట్ నిర్వహిస్తు రోటరీ పట్ల ప్రజల్లో మంచి గుర్తింపు వచ్చే విదంగా పనిచేస్తున్న రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జ్యూబ్లీ సేవలు ప్రశంసనీయం అని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీరామ్ పేర్కోన్నారు. కార్యక్రమానికి క్లబ్ ప్రెసిడెంట్



నరహరిశెట్టి రవికృష్ణ అధ్యక్షత వహించగా రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామిని శ్రీరామ్ ముఖ్యఅతిధిగాను, పాస్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.ఎస్.రావు విశిష్ట అతిధిగాను, అసిస్టెంట్ గవర్నర్ టి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ గౌరవ అతిధిగా పాల్గొన్నారు. క్లబ్ నూతన కార్యవర్గ అధ్యక్షులు శ్రీకాంత్ శిష్టల కు నరహరిశెట్టి రవికృష్ణ, సెక్రటరీ దావెర శ్రీకాంత్ కు చందు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ శిష్టలకు ముఖ్యఅతిథి డి.జి.ఎన్. శ్రీరామ్ బాధ్యతలను అప్పగించారు. ప్రెసిడెంట్ శ్రీకాంత్ క్లబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు టి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, పేపకాయల రామకృష్ణ, వర్మ, నారాయణరావు, డా. ఎస్.వి.ఎస్.రావు, డా. టి.వి.బాలకృష్ణ, వడ్డాది ఆదిత్య, సాయికృష్ణ, శ్రీనివాస రాజులను సభ్యులకు పరిచయం చేసారు. అదేవిదంగా బ్లడ్ బ్యాంక్ చైర్మన్ ఉదయభాను బ్లడ్ బ్యాంక్ కార్యవర్గాన్ని, వృదాశ్రమం సెక్రటరీ ముజులూరి విశ్వేశ్వరరావు వృదాశ్రమం కార్యవర్గాని సభ్యులకు పరిచయం చేసారు. ఈసందర్భంగా అతిధులు శ్రీరామ్ మాట్లాడుతూ రోటరీ క్లబ్బు సమాజంలో మంచి గుర్తింపును తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. డా. ఎస్.వి.ఎస్. రావు మాట్లాడుతూ ఈ ఏడాది సభ్యుల సమిష్టి కృషితో క్లబ్‌ను రోటరీ డిస్ట్రిక్ట్ 3020లో ప్రదామ స్థానంలో నిలిపేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాలన్నారు. అనంతరం క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారో త్సవంలో పాల్గొన్న డి.జి.ఎన్. శ్రీరామ న్న సభ్యులు ఘనంగా సత్కరించారు. అదేవిదంగా నూతనంగా బాద్యతలు స్వీకరించిన శ్రీకాంత్ శిష్టల, సెక్రటరీ శ్రీకాంత్ దామెరలను సభ్యులు పుష్పాగుచ్చాలు అందించి ఘనంగా సత్కరించారు. క్లబ్ సభ్యురాలు ఉషారాణి వృద్ధాశ్రమానికి 60 వేల రూపాయల డొనేషన్‌ను అందించారు. ఉషారాణి కుమార్తె చెన్నైక్లబ్ సభ్యురాలు సాయిశ్రీ నూతన ప్రెసిడెంట్ శ్రీకాంత్ శిష్టలకు క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ సెక్రటరీల పేర్లతో ఉన్న బ్యాడ్స్ బహూకరించారు. క్లబ్ సెక్రటరీ శ్రీకాంత్ దామెర వందన సమర్పణ చేసారు. ఈకార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాల్ఫిన్ వెంకన్న, కర్రి అచ్యుతరామారెడ్డి, నల్లమిల్లి మాచారెడ్డి, నెక్కంటి శ్రీనివాస్. జి.కె. శ్రీనివాస్, డా. వాడ్రేవు రవి, వై.డి. రామారావు. పెద్ద సంఖ్యలో రోటరీ క్లబ్ గోల్డెన్ జ్యూబ్లీ సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యతోనే ప్రగతి

**- లాలాచెరువు ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ**
**- విద్యార్థుల ప్రగతికి,భవితకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై బాగా చదువుకోవాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 50వ వార్డులో లాలా చెరువు ఉన్నత పాఠశాలలో అర్బన్ విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "స్టూడెంట్ కిట్స్" పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యుల ఆది రెడ్డి వాసు మాట్లాడుతూ.. విద్యతోనే మనం భవిష్యత్తు లక్ష్యాలను సాధించుకోగలమని, తద్వారా సమాజంలో ఉన్నతమైన స్థానంలో నిలిచేందుకు విద్య ఎంతో తోడ్పాటు నిస్తుందన్నారు. చదువు అభివృద్ధికి సూచిక మని సమాజంలో ఏ ప్రాంతానికి వెళ్లిన వారి అభిప్రాయాలను భావాలను అర్థం చేసుకొని వ్యక్తిగత ఎదుగు దలకు చదువు ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో చదువుతున్న విద్యార్థి ఇంటికి ఒక్కరికే అమ్మ ఒడి సొమ్ము ఇచ్చేవారని,నేడు కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం కార్యక్రమం ద్వారా ఇంట్లో చదువుతున్న పిల్లలు అందరికీ తల్లుల ఖాతాలో సొమ్ము జమచేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు బ్యాగ్, షూ,నోట్ బుక్స్,యూనిఫామ్ లన్నీ కలిపిన కిట్ లను అందచేశారు. -తదుపరి.."ఏక్ పేడ్.. మా కే నామ్" అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి..పాఠశాల ఆవరణ లో మామిడి మొక్క నాటారు.ప్రతి ఒక్కరూ వీలున్నన్ని మొక్కలు నాటి,పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

తొలుత అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి దిలీప్ కుమార్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు స్వాగతం పలికి, స్టూడెంట్ కిట్స్ కార్యక్రమ వివరాలు తెలియచేశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ ని మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్ సుభాషిణి, టి డి పి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్, 50 వార్డ్ ఇన్ ఛార్జి మరియు, టౌన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి యాదవ్, హరి, చింతపల్లి నాని, బి సి సెల్ అధ్యక్షులు ఆనంద్ చిన్ని, అర్బన్ ఎమ్ ఈ ఓ -2 రమా రజని,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.మల్లేశ్వర రావు,అర్బన్ పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు, వార్డు పెద్దలు వనచర్ల సుజాత,వందారి లక్ష్మీ, కాసిబోయిన రాజు,జి.సత్యనారాయణ, ఆకుల విజయ భారతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరిస్తాం

**- పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తాం**
**- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ షాన్ మోహన్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం పిఠాపురం రధాల పేట అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన పిఠాపురం నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. అధికారులతో కలిసి హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని మండల, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 556 అర్జీలు అందంగా, వీటిలో ప్రధానంగా రెవిన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్ లైన్, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు శ్మశాన వాటికకు స్థలం మంజూరు తదితర అంశాలకు చెందినవిగా ఉన్నాయి. తొలుత జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఆర్డీవో ఇట్ల కిషోర్ భారత రాజ్యాంగం నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సూచనల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి రెండు వారాల కొకసారి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని ఆయన అధికారులనుఆదేశించారు. పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తామన్నారు. అలాగే అర్జీదారులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలన్నిటినీ త్వరలో పరిష్కారిస్తామని తెలిపారు. ఆర్థిక పరమైన అంశాలు ముడిపడిన అర్జీలపై నిధుల మంజూరు కోరి పరిష్కారిస్తామని, ఇందుకు అర్జీదారులు కొంత సమయం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుండి తగు ఆదేశాలు జారీ అయిన వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు పి.నారాయణ మూర్తి, ప్రసాద్ రాజు,పిఠాపురం,గొల్లప్రోలు కమిషనర్లు ఎన్.కనకరావు, టి.రవి కుమార్, పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దార్లు కె.లక్ష్మి, ఎం.ఉదయ భాస్కర రావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక చోరీకి గురి కాకుండా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తాం

**- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** గంగవరం మండలం కపిలేశ్వరపురంలో ఇసుక నిల్వ కేంద్రం నందు ఇసుక చోరీకి గురికాకుండా భద్రతా చర్యలను మరింత పటిష్ట పరచాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కే.గంగవరం మండలం సుందరపల్లి, పూళ్ల, కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాలలో గోదావరి ఏటిగట్టు బలహీనంగా ఉండి గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక నిల్వ కేంద్రం నందు ఇసుక చోరీకి గురి కాకుండా గేట్లు, ట్రెంచ్ ఏర్పాట్లు, గేట్లు, లైట్లు, సీసీ కెమెరాలతో ఏర్పాటు చేసిన నిఘా ఏర్పాట్లను పరిశీ లించారు. రేయింబవళ్లు నిఘా వ్యవస్థ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఏటిగట్లు ఎంత కాలం నుండి బలహీనంగా ఉన్నాయి వాటి పటిష్టతకు శాశ్వత ప్రాతిపదికన లేదా తాత్కాలిక ప్రాతిపదికన ఇప్పటివరకు చేపట్టిన చర్యలను గూర్చి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్ సుధా సాగర్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 22 అర్జీలు స్వీకరణ



**- మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేందుకు స్పందన స్థానంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'కు శ్రీకారం చుటిందని నగరపాలక నగరపాలక సంస్థ మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి అన్నారు. సోమవారం ఉదయం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి నగరపాలక నగరపాలక సంస్థ కమీషనర్ తరపున మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి 22 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పరిష్కారము చెయ్యాలని ఆదేశించడం జరిగిందన్నారు.

**-ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీలు:** డ్రైనేజి, మురుగు నీరు, త్రాగునీరు, టీడ్కో ఇళ్ళు, ఇంటి పన్ను, వీధిలైట్స్, సరిహద్దు సమస్య తదితర సమస్యలు పై అర్జీ దారుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. **-ఈ రోజు వచ్చిన అర్జీలు...**రాజానగరం మండలం, పాలచర్ల కు చెందిన బోనం శివాజీ సాధారణ ఎన్నికలు 2024 లకు బి.వి.సి ఇంజనీరింగ్ కాలేజీ, పాలచర్ల చెందిన బస్సులను వినియోగించుకోవడమైనదని దానికి సంబంధించి పేమెంట్ ఇప్పించవలసిందిగా కోరారు. రాజమహేంద్రవరం, సీతంపేటకు చెందిన పి.నిరీక్షణ తనకు కేటాయించిన టిట్కో ఇళ్ల ఫ్లాట్ ను వృద్ధురాలైన తల్లి, వికలాంగుడు అయిన కుమారుడు ఉన్నందున తన కు కేటాయించిన ప్లాటును కింది ఫ్లోర్ కు మార్చవలసిందిగా కోరారు. రాజమహేంద్రవరం ఉల్లి తోట వీధి కి చెందిన జి రాధాకృష్ణ తమ వీధిలో మున్సిపల్ వాటర్ పైపు లైన్ లీకేజీ అయినందున సమస్యను పరిష్కరించవలసినదిగా తమ అర్జీలో కోరారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కాంట్రాక్టర్ సిహెచ్ వెంకటరమేష్ తాను జిజిఎం పి గ్రాంట్స్‌లో పూర్తి చేసిన వర్కులకు సంబంధించి బిల్లులు పాస్ ఆర్డర్ పూర్తయిన సి.ఎఫ్ ఎం. ఎస్ సైట్‌లో కాలం అయిపోయినది తిరిగి జిజిఎంపి గ్రాంట్స్ ఫండ్ బిల్లులు ఇప్పించవలసిందిగా కోరారు. రాజమహేంద్రవరం సింహాచల్ నగర్ క్వారీ మార్కెట్ కు చెందిన ఎం చంద్రిక సింహాచల్ నగర్ నందు త్రాగునీరు సౌకర్యం వీధిలైట్లు సమస్య పరిష్కరించవలసిందిగా కోరారు. రాజమహేంద్రవరం కు చెందిన ఎన్ సుబ్రహ్మణ్యం సదరం స్కూల్ దగ్గర మైదవోలు వారి వీధి కన్జర్వెన్సీ రిజిస్ట్రేషన్ కొరకు. రాజమహేంద్రవరం, ఖమ్మం సత్ర వీధి నందు పురాతన శిథిలావస్థలో ఉన్న ఇల్లు రాత్రి పగలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుచున్నందున భవనం పడగొట్టవలసినదిగా కోరుతూ విన్నపాలు వచ్చాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సూపర్నెంట్ ఇంజనీర్ జి పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.వి.ఎస్. ఎన్. మూర్తి పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరం, ఆర్డీవో కార్యాలయ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎనిమిది అర్జీలు స్వీకరణ- ఆర్డీఓ చైత్ర వర్షిణి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చే అర్జీలను త్వరితగతిన నాణ్యతతో కూడిన పరిష్కరించాలని రెవిన్యూ డివిజనల్ అధికారిణి ఎ. చైత్ర వర్షిణి అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ఆర్డీవో ఎ. చైత్ర వర్షిణి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎ. చైత్ర వర్షిణి ప్రజల నుంచి వచ్చిన ఎనిమిది అర్జీలను స్వీకరించారు. ఈరోజు పింఛను, ఇళ్ల స్థలం, భూ సర్వే, కిడ్నీ వ్యాధి గ్రస్తునికి పింఛను కోరుట తదితర అంశాలకు సంబంధిచి ఎనిమిది మంది నుంచి అర్జీలను స్వీకరించా మన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి దరఖాస్తు తాత్సారం చేయకుండా త్వరిత గతిన పరిష్కరిస్తామన్నారు.

ఇందులో భాగంగా రాజమండ్రి నగరానికి చెందిన కే. భానుప్రియ అని మహిళా తాను ప్లాట్ ఫారం మీద షాపు పెట్టుకొని జీవిస్తున్నానని, ప్రస్తుతం ఆ షాపును మున్సిపాలిటీ వారు కొట్టివేస్తున్నందున తనకు జీవనోపాధి కల్పించవలసిందిగా కోరారని, రాజమహేంద్రవరం కు చెందిన ఏ వినయ్ అనే యువకుడు తనకు గుండె సంబంధిత వ్యాధి ఉన్నందున పింఛను మంజూరు చేయవలసిందిగా కోరడం జరిగిందన్నారు. కోరుకొండ గ్రామానికి చెందిన ఎం కామేశ్వరరావు రెవెన్యూ రికార్డుల్లో ల్యాండ్ ఫారం 22 ప్రొబిటేడ్ లిస్ట్ నందు తొలగించవలసిందిగా కోరారని, రాజమహేంద్రవరం వివర్స్ కాలనీ చెందిన కంచర్ల అన్నపూర్ణ తాను ప్రభుత్వం వారి స్థలములో పాక నిర్మించుకొని ఉంటున్నానని, ప్రస్తుతం అది పడవేసినందున వేరే ఒక స్థలం ఇప్పించవలసిందిగా కొరారన్నారు. రాజమండ్రికి చెందిన ఏశేఖర్అనే వ్యక్తి తాను కిడ్నీ వ్యాధితో బాధపడుతునాన్నని ప్రభుత్వ వారు కిడ్నీ బాధితులకు మంజూరు చేయు పింఛను ఇప్పించవలసిందిగా వారు అర్జీలో కోరారని జీదారుల సమస్యలను నిర్ణీత సమయంలోనే పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు.

# ప్రతీ అర్జీకి సత్వర పరిష్కారం అందించాలి

**- కలెక్టర్ షాన్ మోహన్ సగిలి**




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం పిఠాపురం రధాల పేట అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన పిఠాపురం నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. అధికారులతో కలిసి హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని మండలం, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 556 అర్జీలు అందంగా, వీటిలో ప్రధానంగా రెవిన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్ లైన్, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు శ్మశాన వాటికకు స్థలం మంజూరు తదితర అంశాలకు చెందినవిగా ఉన్నాయి. తొలుత జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఆర్డీవో ఇట్ల కిషోర్ భారత రాజ్యాంగం నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సూచనల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి రెండు వారాల కొకసారి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని ఆయన అధికారులనుఆదేశించారు. పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తామన్నారు. అలాగే అర్జీదారులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలన్నిటినీ త్వరలో పరిష్కారిస్తామని తెలిపారు. ఆర్థిక పరమైన అంశాలు ముడిపడిన అర్జీలపై నిధుల మంజూరు కోరి పరిష్కారిస్తామని, ఇందుకు అర్జీదారులు కొంత సమయం ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వం నుండి తగు ఆదేశాలు జారీ అయిన వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేనా నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ కు నియోజకవర్గ సామాజిక అవసరాలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు పి.నారాయణ మూర్తి, ప్రసాద్ రాజు, పిఠాపురం, గొల్లప్రోలు కమిషనర్లు ఎన్.కనకరావు, టి.రవికుమార్‌బీ పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దార్లు కె.లక్ష్మి, ఎం.ఉదయభాస్కర రావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేజ్ వీల్స్‌తో రోడ్ల ధ్వంసం..!

**- లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా**
**- పట్టించుకోని అధికారులు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** అదనపు శ్రమ, ఖర్చు తగ్గుతుందన్న కొందరు ట్రాక్టరు యజమానులు, రైతుల స్వార్థానికి లక్షలాది రూపాయల విలువైన రహదారులు ధ్వంసమవుతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదన్న ధీమాతో ఇష్టారీతిన రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను పరుగుపెట్టిస్తుండడంతో రహదారులు దారుణంగా దెబ్బతింటున్నాయి. వ్యవసాయ సీజన్‌లో వరినాట్లకు ముందు రొంపి దుక్కి దున్నుతారు. ఇందుకోసం ట్రాక్టర్ల చక్రాలు తీసి వేసి కేజ్ వీల్స్ (దమ్ము చక్రాలు) బిగించి దున్నుతారు. దీనివల్ల ట్రాక్టర్లు బురదలో ఇరుక్కొనే అవకాశం ఉండదు. ఈ చక్రాలను పొలంలో బిగించుకొని దున్నడం పూర్తయ్యాక విప్పివేసి టైర్లు బిగించిన తర్వాతే రోడ్లపైకి రావాలి. అయితే ట్రాక్టర్ల యజమానులు ఈ కాస్త శ్రమ ఎందుకన్న భావంతో ఇంటి వద్దనే కేజ్ వీల్స్ బిగించుకుని పొలాలకు వెళుతున్నారు. దీంతో ఇనుప చక్రాల ధాటికి తారు రోడ్డు. సిమెంట్ రోడ్లు పై గాడులు పడుతున్నాయి. ప్రధానంగా తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం వదలి ముక్కామల ఉమ్మడి వారి పాలెం గ్రామాల మధ్య ఇటీవల వేసిన సిమెంట్ రోడ్డు కేజ్ వీల్స్‌కి దెబ్బతింటుంది . ఈ కేజ్ వీల్స్‌తో ట్రాక్టరు ఒక్కసారి ప్రయాణిస్తే పదేళ్లు ఉండాల్సిన రోడ్లు రెండేళ్లకే దెబ్బతినిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వ్యవసాయ సీజన్‌లో వందలాది ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో ఈ రహదారుల్లో ప్రయాణిస్తున్నాయి. ఎవరైనా అడిగినా సమాధానం చెప్పే పరిస్థితి లేదు. పట్టించుకోవాల్సిన పంచాయతీ రవాణా శాఖ, రహదారుల శాఖ, పోలీసులు ఈ వాహనాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కేజ్ వీల్స్‌తో రోడ్డుపైకి వస్తే వాహనాన్ని సీజ్‌చేసి జరిమానా విధించే అవకాశం ఉంది. ఎవ్వరూ పట్టించుకోరన్న ధీమాతో ట్రాక్టర్లు కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు దెబ్బతిని ప్రయాణానికి పనికి రాకుండా పోతున్నాయి. మరమ్మతులు చేసినా మళ్లీ యథా పరిస్థితే. వీటి దెబ్బకు సింగిల్ రోడ్డు మొత్తం నాశనమయ్యే ప్రమాదం ఉంది. వాహన చట్టాల నియమాల మేరకు అసలు రహదారుల పైకి దమ్ము చక్రాలతో రావడానికి అవకాశమే లేదు. నియంత్రణ కరువవడంతో గ్రామీణ రహదారులతో పాటు ప్రధాన రహదారులను ఛిద్రం చేస్తున్నారు. పంచాయతీ రవాణా శాఖ అధికారులతో పాటు రహదారుల శాఖ, పోలీసులు సమన్వయంగా స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## తోట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సహాయం



**పెరవలి, మేజర్ న్యూస్ :** మల్లేశ్వరం గ్రామానికి చెందిన విద్యార్థి సాయి కార్తీక్ కితండ్రి చనిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని తెలుసుకొన్న తోట చారిటబుల్ ట్రస్టు సభ్యులు జూలై 8వ తేదీ సోమవారం మల్లేశ్వరం గ్రామానికి వెళ్లి వారి కుటుంబానికి ధైర్యం చెప్పి సదరు విద్యార్థికి రెండు సంవత్సరాలు ఇంటర్మీడియట్ కాలేజీ ఫీజుతో పాటు బుక్స్ యూనిఫాంకి కూడా ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోట ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తోట మాధవరావు జనరల్ సెక్రటరీ తోట సత్య , ట్రస్టు సభ్యులు తోట ప్రసన్న, తోట కోటేశ్వరరావు, తోట మెహర్, తోట పూర్ణ పాల్గొనడం జరిగింది.

